


నితిన్, వక్కంతం వంశీ, సుధాకర్ రెడ్డి

## నా కెరీర్‌లోనే బెస్ట్ క్యారెక్టర్ చేశాను

**నితిన్** కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్'. వక్కంతం వంశీ దర్శకుడు. రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. శనివారం ఈ సినిమా నుంచి 'ఓలే ఓలే పాపాయి' అనే పాటను విడుదల చేశారు. హేరిస్ జైరాజ్ సంగీత సారథ్యంలో రామ్ మిర్యాల, ప్రియా హేమేస్ ఈ పాటను ఆలపించారు. దర్శకుడు వక్కంతం వంశీ మాట్లాడుతూ 'ట్రైలర్, పాటలకు మంచి స్పందన లభిస్తున్నది. ట్రైలర్ చూసిన వారు ట్రైలర్‌లాగే సినిమా కూడా ఫుల్‌లెంగ్త్ కామెడీతో ఉంటుందా అని అడుగుతున్నారు. ట్రైలర్‌కు పదింతల వినోదంతో సినిమా ఆకట్టుకుంటుంది. రెండున్నర గంటల పాటు ప్రేక్షకులు హాయిగా నవ్వుకుంటారు' అన్నారు. 'ఇప్పటివరకు నేను చేసిన క్యారెక్టర్స్‌లో ఇదే బెస్ట్ అవుతుంది. ఎక్స్‌ట్రా ఎంటర్‌టైన్‌మెంట్‌తో కావాల్సినంత వినోదాన్ని పంచుతుంది' అని హీరో నితిన్ అన్నారు. టైటిల్ తగినట్లుగానే సినిమా ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటుందని నిర్మాత ఎన్.సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు.

## ఎంత ఇచ్చినా తక్కువే



**కన్నడ సొగసరి,** నేషనల్ క్రష్ రష్మిక మందన్న తాజాగా విడుదలైన 'యానిమల్' చిత్రంలో తన అద్భుతమైన నటనతో అందరి ప్రశంసలందుకుంటున్నది. రణ్‌బీర్‌కపూర్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రానికి పాన్ ఇండియా స్థాయిలో మంచి వసూళ్లు దక్కుతున్నాయి. ముఖ్యంగా రష్మిక మందన్న కెరీర్ బెస్ట్ పర్‌ఫార్మెన్స్ కనబరిచిందని, ప్రియురాలిగా..భార్యగా ఆమె అభినయం చాలా గొప్పగా ఉందని సోషల్ మీడియాలో పొగడ్తలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని సన్నివేశాల్లో హీరో రణ్‌బీర్‌కపూర్‌ను మించిపోయిందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా కోసం రష్మిక తీసుకున్న పారితోషికం గురించి ఆసక్తికరమైన చర్చ నడుస్తున్నది. ఈ పాన్ ఇండియా చిత్రానికి రష్మిక దాదాపు 7 కోట్ల పారితోషికం తీసుకుందని తెలిసింది. అయితే సినిమాలో ఆమె పర్‌ఫార్మెన్స్‌కు ఫిదా అయిన అభిమానులు మాత్రం రష్మికకు ఎంత పారితోషికం ఇచ్చినా తక్కువే అంటూ కామెంట్స్ చేస్తున్నారు. 'పుష్ప' తర్వాత రష్మిక మరోసారి పాన్ ఇండియా రేంజ్‌లో సత్తా చాటిందని ఆమె అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## త్రిపాత్రాభినయంలో బాలకృష్ణ

**ఈ ఏడాది** సూపర్ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్నారు అగ్ర హీరో బాలకృష్ణ. వీరసింహా రెడ్డి, భగవంత్ కేసరి చిత్రాలు సాధించిన విజయాలతో మంచి జోష్‌మీదున్నారు. ప్రస్తుతం బాలకృష్ణ తన 109వ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. బాబీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో బాలకృష్ణ త్రిపాత్రాభినయం చేస్తున్నారని తెలిసింది. మూడు వేర్వేరు కాలాల్లో, విభిన్నమైన గెటప్స్‌లో ఆయన కనిపిస్తారని సమాచారం. ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ హైలైట్‌గా నిలుస్తుందని చెబుతున్నారు. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. గౌతమ్ వాసుదేవ్ మీనన్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ప్రథమార్థంలో ప్రేక్షకుల ముందుకురానుంది.

## రణరంగమే రక్తపు ఏరుగా..



విశాల్

**విశాల్** నటిస్తున్న తాజా చిత్రం 'రత్నం'. హరి దర్శకత్వ వహిస్తున్నారు. స్టోన్‌బెంచ్ ఫిల్మ్స్, జీ స్టూడియోస్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి కార్తికేయన్ సంతానం నిర్మాత. ప్రియా భవానీ శంకర్ కథానాయిక. శనివారం ఈ చిత్ర టైటిల్‌తో పాటు ఫస్ట్ షాట్ టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో విశాల్ పూర్తి మాస్ అవతారంలో కనిపించారు. 'కన్నీరే నెత్తురు చిందగా..క్రోధమే రుధిరం చిమ్మగా..ఆగ్రహమే అరుణధారగా..రణరంగమే రక్తపు ఏరుగా' అంటూ బ్యాక్‌గ్రౌండ్‌లో వచ్చే వాయిస్ ఓవర్ టీజర్‌లో ఆసక్తిని పెంచింది. విశాల్ నటించిన గత యాక్షన్ చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుందని, సందేశాత్మక కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని దర్శకుడు తెలిపారు. సముద్రఖని, యోగిబాబు, గౌతమ్ వాసుదేవ్ మీనన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎం.సుకుమార్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, కథ, కథనం, దర్శకత్వం: హరి.

## ఇలాంటి కథ రాలేదు



యశ్వంత్ దగ్గుమాటి

శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' ఉపశీర్షిక. సాయి కిరణ్ దైదా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని యశ్వంత్ దగ్గుమాటి నిర్మించారు. ఈ నెల 15న విడుదలకానుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత యశ్వంత్ దగ్గుమాటి మాట్లాడుతూ 'నాకు అమెరికాలో ఐటీ కంపెనీలు ఉన్నాయి. సినిమా చేయాలనే పాషన్ ఎప్పటి నుంచో ఉంది. మంచి కథతో సినిమా చేద్దామనుకుంటున్న సమయంలో దర్శకుడు ఈ కథ చెప్పాడు. వారం రోజుల్లో కథ పూర్తి చేసి 'పిండం' అనే టైటిల్ పెట్టాం. టైటిల్ తొలుత మాకే ఆశ్చర్యంగా అనిపించింది. అయితే పిండం నుంచే జీవి ఉద్భవిస్తుంది. మరణం తర్వాత కూడా పిండమే పెడతారు. అందుకే ఈ టైటిల్ పెట్టడంలో తప్పు లేదనిపించింది. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులకు కూడా టైటిల్ జస్టిఫికేషన్ దొరుకుతుంది. మూడు కాల వ్యవధుల్లో నడిచే కథ ఇది. మిగతా హారర్ చిత్రాలతో పోల్చితే చాలా భిన్నంగా ఉంటుంది. తెలుగులో ఈ తరహా కథ రావడం ఇదే మొదటిసారి. సినిమా షూటింగ్ సందర్భంగా కొన్ని అనూహ్య సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఒకరు ఫిట్స్ వచ్చి పడిపోయారు. ఒకసారి సెట్‌లోకి పాము వచ్చింది. ఓసారి అమావాస్య అర్ధరాత్రి రోజున షూటింగ్ జరుగుతుంటే అందరూ భయపడ్డారు. అప్పుడు దగ్గరలోని గుడి నుంచి కుంకుమ తెప్పించి అందరికి బొట్లు పెట్టించాం. మేము అనుకున్న దానికంటే సినిమా బాగా వచ్చింది. ట్రైలర్ చూసి ఎంతో మంది డిస్ట్రిబ్యూటర్స్ మమ్మల్ని సంప్రదించారు. భవిష్యత్తులో కూడా మంచి కథల్ని ఎంచుకొని నిర్మాతగా నా ప్రయాణం కొనసాగిస్తాను' అన్నారు.

## ఎవరికీ తెలియని కథ



చంద్రిక రవి

అలనాడు గ్లామర్ నాయికగా తిరుగులేని గుర్తింపును సంపాదించుకుంది సిల్క్ స్మిత. 80, 90 దశకాల్లో ఓ వెలుగువెలిగింది. శనివారం సిల్క్‌స్మిత జయంతిని పురస్కరించుకొని ఆమె బయోపిక్‌ను ప్రకటించారు. 'ది అన్‌టోల్డ్ స్టోరీ' పేరుతో తెరకెక్కనున్న ఈ చిత్రంలో సిల్క్ స్మిత పాత్రను చంద్రిక రవి పోషించనున్నారు. ఎస్‌టీఆర్‌ఐ సినిమాస్ పతాకంపై ఎస్. బి.విజయ్ నిర్మించబోతున్నారు. శనివారం విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో సిల్క్ స్మిత ట్రేడ్ మార్క్ పోజ్‌లో చంద్రిక రవి ఆకర్షణీయంగా కనిపిస్తున్నది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభమవుతుందని, పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయబోతున్నామని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి సమర్పణ: వి.మహాస్త్రీ అమృత రాజ్, రచన-దర్శకత్వం: జయరామ్.

"'హాయ్ నాన్న' క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఎలాంటి హింస, డబుల్ మీనింగ్ డైలాగ్స్ ఉండవు. తండ్రీకూతురు అనుబంధానికి దర్పణంలా నిలుస్తుంది' అన్నారు దర్శకుడు శౌర్యువ్. ఆయన నిర్దేశకత్వంలో నాని, మృణాల్ ఠాకూర్, బేబీ కియారా ఖన్నా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం ఈ నెల 7న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శనివారం దర్శకుడు శౌర్యువ్ పాత్రికేయులతో పంచుకున్న విశేషాలు..

## తండ్రీకూతురు అనుబంధానికి దర్పణం

నాలుగేళ్ల క్రితం ఈ కథ రాసుకున్నా. నానికి కథ చెప్పినప్పుడు బాగా నచ్చింది. వెంటనే సినిమాకు ఓకే చెప్పాడు. ఆరు నెలల పాటు ప్రీప్రొడక్షన్ వర్క్ జరిపి షూటింగ్ మొదలుపెట్టాం. తండ్రీకూతురు అనుబంధం నేపథ్యంలో ఈ కథ నడుస్తుంది. సింగిల్ ఫాదర్ మళ్లీ ప్రేమలో పడితే అనే కాన్సెప్ట్‌తో గతంలో కుచ్ కుచ్ హోతా హై, సంతోషం వంటి చాలా సినిమాలొచ్చాయి. అయితే ఆ సినిమాలతో మా కథకు ఎలాంటి సంబంధం ఉండదు. సమాజంలో జరుగుతున్న చాలా అంశాలను ఈ సినిమాలో చూపించాను.

### సింగిల్ ఫాదర్ కథ

ట్రైలర్‌లోనే కథ ఎలా ఉండబోతుందో తెలియజేశాం. ఇప్పటి పరిస్థితుల్లో చెప్పాల్సిన బలమైన పాయింట్ అనిపించింది. చక్కటి కుటుంబ కథగా హృదయాన్ని స్పృశించే భావోద్వేగాలతో ఈ సినిమా ఆకట్టుకుంటుంది. మామూలుగా అయితే పిల్లలకు సంబంధించిన సగం బాధ్యతలను తల్లి తీసుకుంటుంది. సింగిల్ పేరెంట్ ఫాదర్ విషయంలో మాత్రం అతనే పూర్తి బాధ్యతలు తీసుకోవాలి. పిల్లల చుట్టూ తన జీవితాన్ని నిర్మించుకోవాలి. ఆ తండ్రి భావోద్వేగాలు, సంఘర్షణ ఎలా ఉంటుందనే అంశాలను ఈ సినిమాలో ఆవిష్కరించాను. నాని పాత్ర ఆద్యంతం ఎమోషనల్‌గా సాగుతుంది. ఈ కథ విషయంలో ఆయన విలువైన సలహాలిచ్చారు. మృణాల్ ఠాకూర్ తన పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయింది. ఈ సినిమాలో శృతిహాసన్‌తో పాటు ఒకటి రెండు సర్‌ప్రైజింగ్ పాత్రలు ఉంటాయి. దర్శకుడిగా నా బలం ఎమోషన్. కమర్షియల్ చిత్రాల్లో కూడా ఎమోషన్స్ మిస్ చేయను. నా తదుపరి సినిమా వివరాలను త్వరలో వెల్లడిస్తా.



శౌర్యువ్

## అంచనాలు నిజమయ్యాయి



కార్తీక్‌రాజు, సిమ్రన్ చౌదరి, మహేశ్ రెడ్డి

**'మా చిత్రానికి** అంతటా పాజిటివ్ రిపోర్టులు వస్తున్నాయి. మంచి కాన్సెప్ట్‌తో తీశారని అంటున్నారు. మా అంచనాలు నిజమైనందుకు చాలా ఆనందంగా ఉంది' అన్నారు మహేష్‌రెడ్డి. ఆయన దర్శకత్వంలో కార్తీక్‌రాజు, సిమ్రన్ చౌదరి జంటగా నూతలపాటి నరసింహం తెరకెక్కించిన 'అథర్వ' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. శనివారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో కార్తీక్ రాజు మాట్లాడుతూ 'చాలా చోట్ల హౌస్‌ఫుల్ కలెక్షన్స్ వస్తున్నాయి. క్లూస్ టీం కథాంశంతో వైవిధ్యమైన చిత్రమని అంటున్నారు. ఇన్నోవేటివ్ కాన్సెప్ట్‌తో తీసిన ఈ చిత్రంలో భాగం కావడం ఆనందంగా ఉంది' అన్నారు. ఈ సినిమాలో తాను పోషించిన జర్నలిస్ట్ పాత్రకు మంచి గుర్తింపు దక్కిందని కథానాయిక సిమ్రన్ చౌదరి పేర్కొంది. తొలిరోజే చక్కటి ఆదరణ లభించడంతో సినిమా కోసం పడ్డ కష్టాన్ని మొత్తం మర్చిపోయామని నిర్మాత అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.



రాశీ ఖన్నా

## ఏదో తెలియని సంతోషం..

తెలుగులో ఒకప్పుడు అగ్ర కథానాయికల్లో ఒకరిగా పేరు తెచ్చుకుంది రాశీఖన్నా. 'థాంక్యూ' తర్వాత ఆమె తెలుగులో మరే చిత్రంలోనూ నటించలేదు. ప్రస్తుతం హిందీ, తమిళ భాషల్లో బిజీగా ఉంది. ఇటీవల ఈ భామ పుట్టిన రోజును జరుపుకుంది. ఈ సందర్భంగా తన ఇంటి తోటలో కొన్ని మొక్కలు నాటింది. ఆ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకుంది. చెట్లు తనకు ఎంతో సంతోషాన్నిస్తాయని, చెట్ల పెంపకాన్ని గొప్ప బాధ్యతగా తీసుకున్నానని రాశీఖన్నా పేర్కొంది. 'చాలా రకాల కారణాలతో నేను మొక్కలను పెంచుతున్నా. చెట్లు నా కళ్లకు రంగులను పంచుతాయి. ఏదో తెలియని సంతోషాన్ని కలిగిస్తాయి. ముఖ్యంగా నా ఆత్మను సంతృప్తి పరుస్తాయి. మున్ముందు కూడా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తాను. పర్యావరణంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలకు కొనసాగింపుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాను' అని ఇన్‌స్టాగ్రామ్‌లో వ్యాఖ్యానించింది. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తమిళం, హిందీ భాషల్లో నాలుగు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది రాశీఖన్నా.